
నాకు నచ్చిన నా కథ

# ఎక్కడహో... నరరుధిరం?

డా॥ పి.వి. రమణ



*"డాక్టర్! నా భార్యను బ్రతికించండి. నా దేవతను తిరిగి నా కందించండి! మీరు కోరినంత ధన మిస్తాను. నా సమస్తాన్నీ ధారబోస్తాను. నా ప్రేమమూర్తికి ప్రాణదానం చేయండి ప్లీజ్!'*

ప్రొఫెసర్ రంగనాథం ప్రాధేయపడుతున్నాడు. దీనంగా వేడుకొంటున్నాడు. లక్షలూ, కోట్లూ అయినా ఇస్తానంటూ డాక్టర్ల ముందు మోకరిల్లుతున్నాడు. చావుబ్రతుకుల సరిహద్దు ద్వారాన్ని సునాయాసంగా తెరిచి, తుది వీడ్కోలు పలకడంలో ఎంతో ప్రసిద్ధి చెందిన హాస్పిటల్ అది. రోగిగా వచ్చి శవమైపోవటం అక్కడి ప్రత్యేకత. అన్ని హంగులూ వుంటాయనుకునే నగరంలోని పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి అది.

"ఆక్సిడెంట్ చాలా ప్రమాదమైంది. మా శాయశక్తులా ప్రయత్నిస్తాం." వృత్తి మీది ధ్యాస కన్నా డబ్బు మీది యావ డాక్టర్లలో చలనాన్ని కలిగించింది.

"అయ్యా, ప్రొఫెసర్ గారూ! ముందు ఈ మందులు అర్జెంటుగా తెప్పించండి. ఊ... క్విక్!" చీటీ అందించారు డాక్టర్లు.

రంగనాథం గారు ఆ మందులను వెంటనే తెమ్మనమని తన ఆశ్రితుడికి కారు తాళం చెవు లిచ్చాడు./కారు దూసుకుపోయింది. దాని చక్రాలు గాల్లో ఆడుతున్నాయి.

" 'ఈ హాస్పిటల్లో అన్ని అవసరమైన మందులూ వుండాలి కదా, వుండి తీరాలి! అతి పెద్ద ఆస్పత్రి. మరి ఈ సోషలిస్టు నామాంకితదేశంలో' అని ఆలోచిస్తున్నారా? కానీ మందులు సునాయాసంగా బయటకు పోయి, వాటి తాలూకు డబ్బు, కాపిటలిస్ట్ డాక్టర్ల జేబుల్లోకి ప్రవహిస్తుంది. ఇది మామూలే. ఈ మాత్రం తెలవదా? పిచ్చి ఆలోచనలూ, మీరూను!"

"రోగులు చావరటయ్యా, ఈ మందులన్నీ అయిన కాడికి అమ్ముకుంటే?" అనుభవం లేని జూనియర్ డాక్టర్ ఆవేదనతో అడిగిన ప్రశ్న.

"చావనీ, పుట్టింది చావడానికే గదయ్యా, చవట సందేహాలూ నీవూ!" సీనియర్ డాక్టర్ క్రూరహాస్యం.

"మరి ఈ హాస్పిటల్...?"

"శ్మశానానికి చేరే ముందు ఇదొక చెక్ పోస్ట్."

"ఓర్నీయమ్మ సీనియర్ ముండాకొడకా! నీ గుండె చుట్టూ వున్నవి ఎముకలు కావురా, రావణాసురుని కాష్ఠం నుంచి తప్పుకొచ్చిన కట్టెముక్కలు! నీలో వున్నది స్పందించే మనసు కాదురా, మరగబెట్టిన నాగుల విషం!" జూనియర్ అంతర్మథన.

ఎమర్జెన్సీ ఆపరేషన్ వార్డ్ సింగారమవుతోంది. స్ట్రెచర్ మీద మిసెస్ రంగనాథం. వార్డ్ బాయిల జేబులు నిండాయి. చేతులు, కాళ్లలో తిన్న డబ్బు తాలూకు శక్తి. వాళ్లూ మనుషుల్లా నటించారు. కత్తులూ, కత్తెర్లూ తళతళ మంటున్నాయి, డబ్బు వాసనతో.

ఇప్పటిదాకా అవి తుప్పు పట్టే వున్నాయి. ఉంటేనేం, చస్తే రోగులే కానీ, డాక్టర్లు కాదు కదా! బడ్జెట్ వుంది. ప్లాన్లున్నాయి. మంత్రి గారి మహోపన్యాసం వుంది. కోటాలున్నాయి. కాంట్రాక్టర్లున్నారు. కొండ చిలువ లున్నాయి.

"రెడీ చేయండి థియేటర్‌ను. కత్తులూ, కత్తెర్లూ స్టెరిలైజ్ చేయండి. జాగ్రత్తగా చూడండ్రోయ్! అవి స్టీలువో, కోటింగ్‌వో. పేషెంటు ఖరీదైందిరా బాబూ! సిస్టర్ లేదా? స్ట్రయిక్‌లో వుందా? చేయనీ. మొన్న మనమూ చేశాంగా? అసలింతకూ రక్తముందా? అవును మరిచానూ, ఆ పేషెంటు బ్లడ్ టెస్ట్ చేశారా? ఏ గ్రూప్ రక్తం?"

"సీనియర్ డాక్టర్ గారూ! అద్భుతం... పరమాద్భుతం! ఈ పేషెంటు బ్లడ్ మన గ్రూపుల్లో దేనిదీ కాదు!"

"పిచ్చివాగుడు కట్టిపెట్టు! ఏ గ్రూపు లోనిదీ కాదా?"

"అవును డాక్టర్! కుళ్ళిపోతున్న వ్యవస్థ, వంచన, మోసం, దగా, స్వార్థం, కులాలు, అంతఃకలహాలు... ఈ సమాజమంతా వల్లకాడై పోయింది. ఈ వల్లకాటి నుండి పేషెంటు క్కావలసిన రక్తం దొరకడం అసాధ్యం...!"

"నోర్మూసుకో! నిన్న గాక మొన్న ప్రాక్టీసు మొదలుపెట్టి, నాకే మానవచరిత్రపాఠాలు బోధిస్తావా? ఖబడ్దార్! ఈ పేషెంటు క్కావలసిన రక్తం సిద్ధం చెయ్యి!"

"అయ్యో! నేను నిజమే చెబుతున్నాను డాక్టర్! మన గ్రూపుల్లో ఏ రక్తమూ కాదు ఈ పేషెంటుది. మీరూ పరిశీలించండి."

"ఇదేమిటీ రక్తం వింతగా వుందీ? లోగడెప్పుడూ చూళ్ళేదు ఈ రకమైన రక్తం. మరిప్పుడు పేషెంటుకు ఆపరేషన్ ఎలా చేయాలి? ఈ రక్తం ఎక్కడ దొరకాలి? అవునూ, ప్రొఫెసర్ వున్నాడుగా? ఎక్కడో తంటాలు పడి తెస్తాడులే. అయ్యా, ప్రొఫెసర్ రంగనాథం గారూ! మీ భార్యకు రక్తం కావాలి. ఆమెకు సరిపోయే గ్రూపు రక్తం మా వద్ద లేదు. ఇదేదో కొత్త రక్తం. వెళ్ళి పట్రండి. ఇంకా వెళ్ళవేమయ్యా?" సీనియర్ డాక్టర్ చిందులు. రంగనాథం ఉరుకులు, పరుగులు.

"మీరు కంగారు పడకండి డాక్టర్. తెస్తాడులే ఆయన భార్యకు సరిపడే రక్తాన్ని. ఆయన పని చేసే విశ్వవిద్యాలయంలో అందరూ స్వచ్ఛమైన మేధావులేగా? మానవరక్తం అదే. నిఖార్సయినది దొరక్కపోదు" సర్ది చెబుతున్నాడు కుర్రడాక్టర్.

000

కథ మానవజీవనశకలాన్ని శక్తిమంతంగా ఆవిష్కరిస్తుంది. విలక్షణమానవప్రవృత్తులనూ, నైతికంగా పతనమైన సమాజంలో, స్వరూపంలో తప్ప స్వభావంలో మనిషి ఉదారతత్వాన్ని సంపూర్ణంగా కోల్పోయిన అవశేషమానవుని దైన్యరూపాన్నీ, ఆవిష్కరించే 'ఎక్కడహో! నరరుధిరం!' అనే నా కథ అంటే నాకెంతో అభిమానం. సాటి మానవుని సుఖస్తాన్నీ హరించేసే మానవుని మరో విలక్షణవికారరూపాన్ని ఈ కథ అభివ్యక్తం చేస్తుంది. ప్రాణం పోయవలసిన వైద్యునిలో ధనకాంక్ష ఎంతగా పేరుకుపోయిందో, స్వచ్ఛమైన మానవరక్తం ఎంతగా అలభ్యమైపోయిందో ఈ కథ నిరూపిస్తుంది.

రచయిత



"ఘనమైన ఈ విశ్వవిద్యాలయంలోని నా సహఆచార్యులారా! ఆర్యులారా! దయ చూడండి, దయ చూపండి. మీ విలువైన రక్తాన్ని కొంత దానం చేసి, నా భార్యను బ్రతికించండి. విద్యావేత్తలారా! మేధావిపుంగవులారా! గుణశ్రేష్ఠులారా! ఉన్నతులారా! కనికరించి కాస్త మీ రక్తాన్ని నా భార్య కొరకు ధార పోయండి. ఆక్సిడెంటై నా భార్య చావుబ్రతుకుల్లో వుంది. స్వచ్ఛమైన రక్తం కావాలిట. అది మీ దగ్గర దొరుకుతుందని గంపెడాశతో వచ్చాను. కాదనకండి, చేతులెత్తి మొక్కుతున్నాను" సహ ప్రొఫెసర్లను ప్రాథేయపడుతున్నాడు రంగనాథం.

"నా ప్రియమైన విద్యార్థుల్లారా! ఈ దేశఆశాజ్యోతుల్లారా! మీరైనా... మీరైనా మీ నిష్కల్మషమైన రక్తాన్ని నా భార్య కింత దానం చేయండి. మీ గురుపత్నిని బ్రతికించుకోండి. ఏమిటి నాయనలారా, అట్లా నవ్వుతున్నారు? నా భార్య చస్తే ప్రపంచానికేమీ లోటు లేదంటారా? అట్లా పగలబడి నవ్వకండి బాబూ! మీ మనసుల్లోనైనా ఇంత జాలి లేదా? ఇది దారుణం!" ప్రొఫెసర్ రంగనాథం విలపిస్తున్నాడు. ఎలుగెత్తి ప్రార్థిస్తున్నాడు.

"ప్రొఫెసర్ గారూ! లాభం లేదు. వీళ్ల రక్తం కూడా టెస్ట్ చేశాను. ఈ రక్తంలో మీ శ్రీమతి గారికి ఏదీ సరిపడదు. ఈ రక్తాల్నిండా మానవరక్తచిహ్నాలు గాక, మరేవో వింతలక్షణాలు కనిపిస్తున్నాయి."

"ఏమంటున్నారు డాక్టర్? ఇంత మందిలో ఒక్కళ్ల రక్తం కూడా నా భార్యకు సరిపోదా?"

"అవును ప్రొఫెసర్! వీళ్ల రక్తాల్నిండా ఇంకా పేరు పెట్టని ఏవో భయంకరసూక్ష్మక్రిము లున్నాయి. వంచన, కులం జిడ్డు, వెన్నుపోట్లు, అడ్డదారి ప్రమోషన్లు, అవినీతి, బంధుప్రీతి, హిపోక్రసీ... ఈ అవలక్షణాలతో వీళ్ల రక్తం కుళ్ళిపోయింది. ఈ రక్తం ఎక్కిస్తే మీ భార్య హరీ మనటం ఖాయం!"

"నో డాక్టర్, ఆమె బ్రతకాలి, బ్రతికి తీరాలి! ప్రొఫెసర్లు, అధికారులు, నాయకులు, బ్రోకర్లు, లోఫర్లు, పూజారులు... ఒకరేమిటి? అందరూ ఆమె రక్తాన్ని తెగ తాగారు. ఇప్పుడు ఒక్కరి రక్తం కూడా ఆమెకు సరిపడటం లేదు. నేనూ ఆమె రక్తం తాగే ఈ స్థితికి వచ్చాను డాక్టర్! ఇప్పుడెలా డాక్టర్? ఆ త్యాగజీవిని, ఆ కారుణ్యమూర్తిని, ఆ దయామయిని రక్షించుకునే దెలా? చెప్పండి డాక్టర్!" ప్రొఫెసర్ వేడుకోలు.

"దయా, దాక్షిణ్యం, ఉదారత, త్యాగం... ఈ లక్షణాలన్నీ వున్న రక్తం కావాలి ఆమెకు. ఆమె గ్రూపు రక్తం అదే. వెదకండి ప్రొఫెసర్. మానవుల్లో దొరక్కపోయినా, మరే పశుపక్ష్యాదుల్లోనైనా దొరక్కపోదు. పోనీ, క్రీస్తు శిలువ రక్తధారల జాడేమైనా దొరుకుతుందేమో, అన్వేషించండి. లేదూ, ఆమె నిక్కడే వదిలేయండి, ఆమె శవాన్ని షో కేసుల్లో భద్రపరుస్తాం."

"షటప్! నీవూ ఒక డాక్టరువేనా? ఆ ముసుగులో వున్న కిరాతకుడివా?" ఆవేశంతో ఊగిపోయాడు ప్రొఫెసర్.

"నా మీద ఆగ్రహిస్తావేమయ్యా పిచ్చి ప్రొఫెసర్? నీ మంచికోసమే చెప్పాను. సర్లే. వెదుకు, వెదికి నీ భార్యకు సరిపోయే గ్రూపు బ్లడ్ పట్టుకురా!" హితవుగా చెప్పాడు డాక్టర్.

000

ఇప్పు డిది వర్తమానం. దీనికి భూమికైన గతం వుంది. ఆ గతాన్ని మీ ముందుకు తెస్తాను, తిలకించండి.

నాకు తెలిసినప్పటి నుండీ ఆ రోడ్డు మొగదలలో, ఆ వరస పాన్ డబ్బాల మాటుగానో, ఆ పక్క హోటళ్ల ముందటనో, మొత్తానికి అక్కడే ఎక్కడో చోట తారసపడతాడు ఆ మనిషి. రాత్రులు మకాం మాత్రం ఆ పక్కనే వున్న

## ముల్లంగి ఉపయోగాలు

చలికాలంలో కూరగాయల బజారులో ముల్లంగి కుప్పలుగా కనిపిస్తుంటుంది. చవకగా దొరుకుతుంది కనుక దీన్ని అందరూ వాడుకోవచ్చు. ముల్లంగిని కచ్చా పచ్చాగా దంచి ఆ ముద్దను పిండిలో కలిపి పరాటాలు చేసుకోవచ్చు. ముల్లంగి నీటిలో సెనగపిండి, ఉప్పు, కారం కలిపి, పెనం మీద వేయించి తీసుకోవటం మధుమేహరోగులకు మేలు చేస్తుంది. ముల్లంగిని దంచి తీసిన రసం అర కప్పులో కాస్త ఉప్పు వేసి తాగటం వల్ల కామెర్లు పూర్తిగా తగ్గుతాయి.

ఎన్.



ప్రహారీ లేని కాలేజీ వరండా మీదనే. ఆ కాలేజీ బయట తరగతి గదులున్నాయే, అవి రాత్రి పూట వివిధవ్యసనాలకూ, వ్యసనపరులకూ విడిది క్షేత్రాలు. వీటన్నిటినీ చూస్తూనే, వీటి మధ్య వుంటూనే తన లోకమే తనదన్నట్లుగా వుండే ఆ మనిషిని, మీరూ ఎప్పుడో ఒకప్పుడు చూసే వుంటార్లెండి. ఇప్పుడు మీరు గుర్తు పట్టలేకపోవచ్చు.

లోగడ సంగ తెందుకు గానీ, ఆ మనిషి వివరాలివి. పేరు నిర్వికారం; వృత్తి మానవసమాజంలో అడుగంటిన మానవత కోసం అన్వేషణ; బరువు పది టన్నుల నిస్పృహ; ఎత్తు ఆకాశం కొనలంటా పాకిన విషాదజ్ఞాపకాల తీగెలు; వ్యాపకం స్వచ్ఛమైన నవ్వునూ, మాటనూ చూడాలన్న ఆరాటం; అనుభవాలు యూనివర్సిటీలో తిష్ఠ వేసిన మేధావి దొంగల వంచనకూ, కుట్రలకూ బలైపోయిన బంగారు భవిష్యత్తూ, గవర్నమెంటు హాస్పిటల్‌కు ప్రాణదానం చేసిన అమాయిక అర్ధాంగి మిగిల్చిపోయిన విషాదస్మృతుల చిచ్చూనూ. విశేషం ఆకలిదప్పుల పట్ల ఆసక్తి లేకపోవడం; విద్య ఎం.ఏ.లో గోల్డ్ మెడల్; ప్రత్యేకమైన గుర్తులు అస్థిపంజరం లాంటి దేహం నుండి కార్చిచ్చులా ప్రజ్వలించే కళ్లు.

ఇవన్నీ ఆ మనిషి ఆనవాళ్లు. మీరిప్పుడు తేలిగ్గానే అతన్ని గుర్తు పట్టొచ్చనుకుంటాను; ట్రై చేయండి.

ఆ మనిషి మళ్లీ నవ్వుతున్నాడు తనలో తాను. అది జీవం లేని నవ్వే అయినా, ఎన్ని ప్రాపంచికపారమార్థికసత్యాలో ఆ నవ్వులో! "దేవుడు వున్నాడో లేడో గాని, అందరికీ చావును సమానం చేశాడు. అచ్చమైన సోషలిజం అమలు జరిపాడు ఈ విషయంలో. కోటీశ్వరునికి పదివేల సంవత్సరాలనీ, నిరుపేదకు ఇరవై సంవత్సరాలు మాత్రమేననీ ఆయుస్సును వర్గీకరణం చేసి పెట్టలేదు." దేవుణ్ని మనసారా అభినందించాడు ఆ మనిషి.

ఆ మనిషి ముందుకు సాగాడు. కాలేజీ కాంపౌండు పక్కనే ప్రభుత్వ సారాదుకాణం. అతని నరాలు గుంజినై, నాలుక ఆర్చుకుపోతున్నది.

"ఒరే, ఒక్క యాభై గ్రాములు అప్పియండిరా! నాలుక పిడచగట్టుకుపోతున్నది. కాళ్లు తేలిపోతున్నాయి. పోయ్రా మీరు! డబ్బే మీ ప్రాణం! ఆ రంగు కాగితాలే మీ జీవం!" ఆ మనిషి పెదాలు దాటని గొణుగుడు.

"ఏంది పంతులూ యవ్వారం? తాగుడు మా జోరైందంటగా?" వాడు, ఆ వ్యాపారి వరాచకం.

ఈ వ్యాపారి గాడికి డబ్బే లోకం. గల్లా పెట్టె ముందు నల్లదున్నపోతులా వీడు. ఆ రంగు కాగితాల రంగు పోతే, వీడి బ్రతుకు రంగూ పోతుంది. పాంపిల్లల్లా వీడి సంతానం, ఆ ఇనప్పెట్టె కాపలాకు. వీడి పెళ్లానికి మల్లెపూలు పట్టుకెళ్తాడు ప్రతి సాయంకాలం. అయినా, ఆ గదంతా పాచికంపే. ఎన్ని నగలు దిగేసుకున్నా వీడి పెళ్లాం ఎలుగుబంటిలాగే వుంటుంది. ఆ ఇల్లంతా వీడి పెళ్లాం చెమట కంపే. వీడు కూడా అపహాస్యం చేస్తున్నాడు. ఫూల్! ఆ మనిషిని కాలుస్తున్న వేదన, రాక్షసి కురుపులా వ్యాపించి అంతరంగాన్ని కొరుక్కు తింటున్న క్షోభ.

"రాస్కెల్స్! వీళ్లకేం తెలుసు? కాలిన గుండెను చల్లార్చుకోవడానికే ఈ మందు. అసలు శివుడెందుకు మింగాడు విషాన్ని? దేహం... అహం... దాహం. అన్నింటి నుండీ విముక్తి! లోకముక్తికి! సత్యం... సౌందర్యం... శివం... తాదాత్మ్యం... అందుకే నేను మింగుతున్నాను ఈ విషాన్ని! దేహం కోవెల అయితే గర్భాలయం కుక్షి. మండపం సారాకొట్టు. మంటలు మంటలైనా, మత్తు కళ్ల ముందు చల్లని వెలుగు. అసలు వీళ్లకేం తెల్సును శతాబ్దాల వ్యథితహృదయాల గోడు? కారుణ్యం కార్చే కన్నీళ్ల విలువ? వీళ్లంతా ఆర్ద్రమానవతాతంత్రులు తెగిపోయిన చవటలు! నటనలతో, నక్కవినయాలతో, నంగి నంగి దణ్ణాలతో నలిగి చచ్చే కృత్రిమజీవులు!" ఆ మనిషి ఘనసంతా ఆక్రమించుకుంటున్న వేదనాక్షరానుభూతులు!

"తొలుగు... తొలుగు! దారి నిండా అలగాజనం! నీ యమ్మ కడుపు మాడ, దూరంగా జరగరా! మడి కట్టుకున్నాను" పూజారి విసుగుదల.

ఆ మనిషి నిర్వేదంగా నవ్వుకున్నాడు పూజారిని చూసి. "వీడప్పుడే దేవాలయానికి పెద్ద భక్తుడి పోజులో, పదిమందినీ ఆకట్టుకోవాలన్న దొంగ వేషం! ఈ శరీరమే వీడికి సర్వస్వం. శరీరం నశిస్తుందిరా! ఆత్మేరా శాశ్వతం! అయినా వీడికి ఆ జ్ఞానం లేదు, రాదు కూడా. కడుపు కక్కుర్తికి కపటనటన. దొంగ వ్యాపారికీ, హంతకునికీ, దోపిడీనాయకునికీ శతాయుష్మాన్ భవ అంటూ వీడి శరగోవ దీవెనలు. భలే దేవుడు! చీకటి గదిలో ఒదిగిన పిచ్చి సన్నాసి!"

ఆ మనిషి నడుస్తున్నాడు. కరడు గట్టిన మానవతాద్వారాల నుండి సూక్ష్మాతిసూక్ష్మంగానైనా ఇంత ఆప్యాయతాకాంతిరేఖ కనిపిస్తుందేమోనన్న ఆశతో... ఆరాటంతో...

ఎవరక్కడ? ఎవరహో? నిద్ర రాని రాత్రి వికారంగా మొరుగుతూ వుంది. ఆ వికారపునీడల్లో అనాగరకమానవజీవనపు అలమటింపు సవ్వడులు. స్వార్థం నిప్పుల కొలిమిలో దగ్ధమైపోతూ నీతినిజాయితీలు చేస్తున్న ఆర్తనాదాలు, వెర్రితలలు వేస్తున్న విజ్ఞానం, పుచ్చిపోయిన పురుషార్థాలు, రక్తదాహాల సైరన్ మోతలు, కామపు కక్కుర్తి కేరింతలు, ఈ ప్రపంచం ఇప్పుడు ఒక వధ్యశాల. ఈ వధ్యశాలపై నరనారుల అసభ్యశృంగారనృత్యాలు... "ధినక్... ధినక్... తద్ధినక్ ధినక్..." వొరిగిపోతున్నది భూమి. సముద్రం గుండె ఉక్కిరిబిక్కిరైపోతున్నది. ఊరవతల మర్రి చెట్టుకు బలవంతపు రాజకీయాల ఉరి. అభాగినుల ఆత్మాహుతులు... ఓట్లూ-నోట్లూ, సారా-మత్తూ, ప్రజాస్వామ్యం-అధికారం-ఈ మృత్యుయాత్ర తిరనాళ్లలో ఎవరికి వాళ్లే తల కొరివి పెట్టుకుంటున్న నాగరకజనం. ఆ మనిషి అంతరంగం అలిసిపోయింది. ఆ మనిషి తలలో పేరుకుపోతున్న శూన్యం. మెదడులో పురుగు. ఆకాశం ఇంకా ఎందుకు కూలదో? పోనీ తన గుండె ఎందు కాగదో? మట్టిని మండించే సూర్యుడు రాత్రి పారిపోతాడు, పిరికివాడిలా. చెత్త కుండీ పక్క నిద్రించే నిర్భాగ్యుల కాలం కునుకు తీస్తారు. ఏరీ వాళ్లకు హారతులు పట్టి స్వాగతం చెప్పేవారు? పోనీ తన కింత చేయి ఆసరా అందించే దయార్ద్రులు ఎవరూ లేరా? ఒక్కరూ రారా? సప్తమి రాత్రి. మసకమసక వెలుతురులో జీవనమూల్యాలతో, ఆ మనిషి రాస్తున్న మహాకావ్యానికి సుభాషితాలు అందిస్తున్న నిద్రాణప్రకృతి.

"ఈ జబ్బు నన్ను తినేసిందండీ. మిమ్మల్ని ఒంటరిని చేసి వెళ్తున్నాను" మూతపడ్డ ఎండిన

పెదాలు చీల్చుకొని, నిస్ప్రాణంగా అంది ఆ మనిషి భార్య.

"నువ్వు చచ్చిపోవు, ఎన్నటికీ చచ్చిపోవు!" దీనంగా ఆమెను చూస్తూ అన్నాడు. పాలిపోయిన ఆ పెదాలపై జీవం లేని నవ్వు, కరవుగా క్షణకాలం మెరిసి మాయమైంది. ఆమె గుండె కొలిమి ఆరింది. పక్షి లేచిపోయింది. పంజరం మిగిలింది బోసిగా. ఆ మనిషి సగం చచ్చిపోయాడు. జీవనమృత్యుతీరాల మధ్య ఎండిన పాయలా అయ్యాడు. తన చుట్టూ అల్లుకొని, కష్టాల్నీ, బాధల్నీ పంచుకుంటూ దయగా సాకుతూ వచ్చిన అర్ధాంగి దూరమవడంతో ఆ మనిషి బజార్న పడ్డాడు.

ఆ మనిషికి, యూనివర్సిటీ గోల్డ్ మెడల్ ఇచ్చినప్పుడు, దరిద్రం కమ్ముకొన్న ఆ కొంపలో ఇక అంతా సంబరమే వచ్చిపడుతుందని మురిసిపోయిన అమాయకపుతల్లి, తనకు చేదోడై, సంసారానికి ఆసరా ఇస్తాడని భ్రాంతిలో పడిన తండ్రి, ఇంటర్వ్యూల్లోని ఉద్యోగాలన్నీ అమ్ముడైపోతున్నప్పుడు, ఆ మనిషి ఆశలు అంతరించిపోతున్నప్పుడు, ఆయువు తుది వీడ్కోలుకు తల వంచి వెళ్లిపోయారు తల్లిదండ్రులు.

ఆ యూనివర్సిటీ లెక్చరర్ ఉద్యోగం సైతం అన్ని అర్హతలూ వున్న తనను కాదని, కుట్రలూ, కుతంత్రాలతో తన కూతురికే ప్రొఫెసర్ ముడుపు కట్టేసరికి, ఆ మనిషిలోని ఆశలన్నీ బూడిదైపోయాయి. యూనివర్సిటీలు సైతం వంచనాకేంద్రాలుగా మారిపోయినప్పుడు, ఆ మనిషి విరక్తుడయ్యాడు. బ్రతుకు అగమ్యమైంది. భవిష్యత్తును కాలానికే వదిలేశాడు. ఆ కాలం చేసిన అనేకానేకగాయాలతో రాటు దేలిపోయింది ఆ మనిషి శరీరం.

వాన రాబోయే సంకేతం, పిడుగు ధ్వని. కళ్లను చీలుస్తున్న మెరపులు. దీనమ్మ, దీనికీ తొందరే! ఉన్నవాడికే దేవుడు మళ్లీ వరాలిచ్చినట్లు, ఈ వర్షం వద్దన్న కొద్దీ వస్తుంది. లేనప్పుడు రానే రాదు. కాలేజీ వరండాలో ముడుచుకుపడుకున్న ఆ మనిషిలో అసహనం.

అప్పటి దాకా, మానవాధముల పడక తొక్కిళ్లలో నలిగి, కామపుబుసలలో కమిలి, నీరసంగా వచ్చి కూలబడింది సావిత్రి.

వచ్చిన అతిథి వైపు చూశాడు ఆ మనిషి. "ఈ తిరుగుళ్లు మానుకోరాదూ?" అవసరం లేని ఆ మనిషి పరామర్శ.

"ఏం ఎందుకు మానాలి? నేనేమన్నా నీలమణుల కోసం ఆరాటపడుతున్నానా? నింగి నందుకోవాలని ఆశ పడుతున్నానా?" ఆ మనిషిని పరిశీలిస్తూ అంది సావిత్రి.

"ఈ చెడ్డ పనులెందుకు?"

"బ్రతకడానికి. ఆ మాత్రం తెలియదా పిచ్చి పంతులూ?"

"బ్రతకడానికేనా?"

"పిచ్చిపంతులూ, ఈ లోకాన్ని చదివావనుకున్నాను. సముద్రంలో వుంటూ కూడా ఉప్పు రుచి ఎరుగనట్లే వున్నావంటే వింతగా వుంది."

"సమర్థించుకోవటం కాదు, సరైన సమాధానం చెప్పాలి."

"ఈ వ్యాపారప్రపంచంలో మంచిచెడులను పరిశీలించే దశలోనే ఇంకా నీవు వున్నావంటే చిత్రంగా వుంది నాకు. నేను చేస్తున్నదే చెడుగా కనిపించినప్పుడు, అసలీ ప్రపంచంలో చెడు గాని దింకేముంటుంది చెప్పు? నిజమే, నా బ్రతుకు బజారు భాగోతమే! నేనిట్లా చేస్తూన్నది, వొళ్లు కొవ్వెక్కి కాదు, కామం తల కెక్కీ కాదు. ముగ్గురు చెల్లెళ్లకు అక్కనైన నాకు, పేదతండ్రి లాంఛనాలతో పెళ్లి జరిపించలేడు. తన అసహాయత, దరిద్రం, పెళ్లి కొడుకుల సిగ్గు విడిచిన బేరసారాలు, ఆయన్ని బలి తీసుకున్నాయి. తమ్ముడి ఉద్యోగం కోసం ఆఫీసర్ని వేడుకుంటే, వాడు నా శరీరంపై ఆరాటపడ్డాడు. అవసరం నన్ను బలహీనురాలిని చేసింది. ఆ ఆఫీసరుగాడు, బద్మాశ్! నా శరీరాన్ని భోంచేసి గానీ నా తమ్ముడికి ఉద్యోగం ఇవ్వలేదు. తమ్ముడు ఉద్యోగం చేస్తూ అభివృద్ధిలోకి వచ్చాడు. చెల్లెళ్లకు తిండి పెట్టాలన్నా, చదువుసంధ్యలు చెప్పించాలన్నా, నేనీ నరకకూపంలోకి కూరుకుపోకతప్పదని తేలిగ్గానే తెలిసొచ్చింది నాకు. అయినా గుడ్డిలో మెల్లలా తమ్ముడు చెల్లెళ్లను లాలనగా చూస్తూనేవున్నాడు. నా పరిస్థితే పంతులూ, గాలిలో దీపంలా... ఇలా... అది సర్లే గానీ, పొద్దున్నుంచీ చుక్కైనా వేశావా లేదా, కడుపులో? ముఖమంతా పీక్కుపోయింది. ఇంద, ఈ వంద గ్రాములూ కడుపులో వేసుకో, ఉషారొస్తుంది. అసలే వర్షమొచ్చేట్లుంది." బొడ్డులో దోపిన చిన్న సారా సీసా తీసి, ఆ మనిషి కందించింది సావిత్రి.

ఆ మనిషి ముఖం వికసించింది. ఆబగా ఆ సీసా అందుకొని, ఆ ద్రవాన్ని గొంతులో పోసుకున్నాడు. "ఏమనుకోకు సావిత్రీ. నేనేదో అన్నానని. నేనంటే నీకెందుకు ఈ అభిమానం?"

"ఉట్టి అభిమానమే కాదు పంతులూ, నీవంటే నాకు ఆరాధన. మంచి మనసు నీది. దయ నిండిన హృదయం నీది. నీ ఆడది చనిపోతే మరిచిపోలేక, మనసు మళ్లించుకోలేక అల్లాడిపోతున్నావ్. తాడూ బొంగరం లేని బ్రతుకులో వున్నావు. ఉన్న పంతులు ఉద్యోగం వదిలేసి బ్రతుకు పాడు చేసుకున్నావు. ఇదంతా ఆ చచ్చిపోయిన ఆడదానిపై నీవు పెంచుకున్న మమకారమే. ఆ అభిమానంతోనే లోకం మెచ్చుకొన్నా, తెగడుతున్నా పట్టించుకోకుండా, ఆమెనే మనసులో పెట్టుకొని జీవిస్తున్నావు. బ్రతికుండగానే ఇంటి ఆడదాన్ని కాల్చుకుతినే ఈ సన్నాసి వెధవల కన్నా ఎన్నో రెట్లు ఉన్నతుడివి నీవు. ఈ పెళ్లాల్ని కాల్చుకుతినే మగవెధవ లందరూ పెద్ద ధనవంతులైనా, గొప్ప అధికారులైనా, నీ కాలి గోటికి సాటి రారు పంతులూ, ఇది నిజం!"

ఆ మనిషి సావిత్రి వైపే చూస్తూండిపోయాడు. సప్తమి చంద్రుడు మసకమసగ్గా వెలుగుతున్నాడు. సావిత్రి లేచి వచ్చి ఆ మనిషి వీపు నానుకొని కూర్చుంది. ఆ మనిషి ఇవతలకు జరగబోయాడు.

## కేశాలు వివరించే వ్యక్తిత్వం

జుత్తు కూడా వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుతుందని ఎందరికి తెలుసు? వ్యక్తిత్వాన్ని చెప్పటంలో, జుత్తు పొడుగు, ఆకారం, దట్టంగా వుండటం వంటి విషయాలకు ముఖ్యపాత్ర వుందని హార్వర్డ్ యూనివర్సిటీ వారి పరిశోధనల్లో తేలింది. ఎప్పుడూ జుట్టును చక్కగా దువ్వుకుని నీట్‌గా వుంచుకునేవారిలో కెరీర్ పట్ల జాగ్రత్త అధికమని తెలుస్తుందట. నిజానికి పనుల్లో నిమగ్నమైపోయినవారికి జుత్తు సంగతి అంతగా పట్టదు, అందువల్ల దాని కోసం సమయాన్ని వ్యర్థం చేయటానికి ఇచ్ఛగించరు. కొందరు మహిళలకు ప్రతి నెలా కొత్త హెయిర్ స్టయిల్‌ను అనుసరించే అలవాటుంటుంది. ఇలాంటివారు జీవితంలో ఎప్పుడూ కొత్తదనం కోసం వెతుక్కుంటుంటారు. ఒకటే రకం హెయిర్ స్టయిల్ గల మహిళలు, స్థిరచిత్తంతో వుంటారట. అంత సులువుగా ఎవరు చెప్పిన మాటలూ అంగీకరించరట.

ఎస్.



## బహిష్టు నొప్పికి థెర్మాచాయిస్

ముప్పైయ్యేళ్ల తరువాత మహిళల్లో కొందరికి బహిష్టు సమయంలో విపరీతమైన కడుపు నొప్పి వుంటుంది. ఆ నొప్పిని భరించలేక వారు పిచ్చిగా ప్రవర్తించటమూ జరుగుతుంది. కొంత కాలం క్రితం ఆ విధంగా బాధ పడేవారికి చికిత్స, వారి గర్భసంచిని తీసేయటమేనని డాక్టర్లు అనుకున్నారు. కానీ అభివృద్ధి చెందిన వైజ్ఞానికయుగంలో దానిక్కూడా తగిన చికిత్సను కనుక్కున్నారు. దీనికి థెర్మాచాయిస్ యూటరిన్ బెలూన్ పద్ధతి అని పేరు. దీని ద్వారా నొప్పి లేకుండా చేయవచ్చునట. ఈ చికిత్స తరువాత మహిళలు త్వరగానే తమ రొటీన్ పనుల్లోకి వెళ్లవచ్చునంటున్నారు.

ఎస్.



"భయపడకు పంతులూ, ఇంత మాత్రానికే మైలపడిపోవులే, చనిపోయిన నీ ఆడది కళ్లెర్ర చేయదులే!" గలగలా నవ్వుతూ అంది సావిత్రి.

"నాకిట్లా నచ్చదు."

"పోనీ గాని పంతులూ, నీకూ, నాకూ గూడంటూ లేదు కదా. ఇద్దరం కలిసి ఓ గూడు ఏర్పరచుకుంటే?"

"అంటే?"

"నా మెళ్లో తాళి కట్టు. నా మనిషిగా వుండు."

"నీకూ, నాకూ పెళ్లా? ఎవరైనా వింటే నవ్వుకుంటారు."

"ఎవరైనా నవ్వుతారనే విషయం మరిచిపో పంతులూ! ఒకళ్ల కోసం కాదు మనం బ్రతికేది. అసలు ఒక్క వెధవైనా మనను సానుభూతితో ఆదుకున్నాడా? కనీసం అయ్యో అని అనగలిగాడా? మరెందుకు ఈ వెధవల్ని గురించిన భయమూ, బెంగా నీకు?"

ఆ మనిషి సావిత్రి వైపు నిశ్చలంగా చూస్తూ వుండిపోయాడు.

"పంతులూ! నా మనసులో ఒక పథకముంది. దాన్ని ఆచరణలో పెట్టుకుంటే మనిద్దరికీ ఏ లోటూ రాదు జీవితంలో. ఈ వెతుకులాట బ్రతుకూ వుండదు. నీవు సహకరించాలి నాకు."

"ఏ విధంగా?" ఆ మనిషిలో ఏదో అనుమానం.

"నన్ను అనుమానించకు పంతులూ! పట్టు విడిచి నే చెప్పేది సాంతం విను. ఈ జన్మంతా నీ పాదపూజ చేస్తేనైనా నా పాపం కొంత కరిగిపోతుందన్న ఆశే గానీ, నిన్ను మోసం చేయాలని కాదు. నన్ను నమ్మితే, నా మనసులోని ఆలోచన నీకు చెబుతా."

"చెప్పు."

"అమ్మయ్య! కనికరించావు పంతులూ. అంతే చాలు. నా మెళ్లో నిన్ను తాళి కట్టమన్నది నిన్నడ్డం పెట్టుకొని అడ్డమైన తిరుగుళ్లూ తిరగాలని కాదు. ఈ మగపురుగుల బుద్ధి నాకు బాగా తెలుసు. ఇంటి ఆడదున్నా, పరస్త్రీల పొందు కోసం పడిగాపులు పడతారు. ఆ పరస్త్రీ వివాహమైందైతే, ఆమెను వశపరచుకోవాలని అంగలారుస్తారు. పెళ్లయిన ఆడదాన్ని వశపరచుకోవడం అంటే ఈ వెధవలకు హిమాలయం ఎక్కినంత సంబడం! ఈ ఒక్కసారీ నా మాట విను పంతులూ! నేను కొత్తగా చెడిపోయేదేం లేదు. ఆ ఆఫీసరుగాడి ఆకలికి ఆహుతైనప్పుడే నా బ్రతుకు గాడి తప్పింది. నీకా వెధవ లెక్చరర్ పోస్టే కాదు, అదే యూనివర్సిటీలో నీవు ప్రొఫెసర్ అయ్యేట్లు నేను ప్రయత్నిస్తాను. అందుకోసం నా జీవితాన్ని ధార పోస్తాను. అంతా వ్యాపారమయం అయిపోయిన ఈ ప్రపంచంతో మనమూ వ్యాపారం చేద్దాం. లొంగదీసి కాళ్ల కింద పెట్టుకొందాం. మంచివారికి, శక్తికి మించి తోడ్పడదాం. ఇంత కన్నా ఓ జీవితానికి సార్థకత ఏముంటుంది చెప్పు? మన జీవితాలకు ఇంతకు మించిన చరితార్థ తేముంటుంది చెప్పు? మరి తాళి కడతావా నా మెళ్లో? నా ఈ కోరిక మన్నిస్తావా?" అనునయంగా, లాలనగా అర్థింపుగా అడిగింది సావిత్రి.

"నా కోసం ఇంత త్యాగం ఎందుకు చేస్తున్నావు సావిత్రీ?"

"ఇది కేవలం త్యాగమే కాదు, నీకు నా బ్రతుకును నీరాజనం చేసి, ఇట్లాగన్నా పునీతమై పోదామన్న ఆశ!" నిండుగా చెప్పింది సావిత్రి.

ఆ మనిషి కాగికాగి వున్న హృదయం మీద, సావిత్రి మాటలు మంచుజల్లులా పని చేశాయి. ఆత్మీయతతో అతని మనసు ఆర్ద్రమైంది. ఆ మనక వెన్నెట్లో ఆ రాత్రి తొలిసారిగా ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు.

000

సరిగ్గా ఇరవై సంవత్సరాలు దొర్లిపోయినై. ఆ మనిషినీ, అతని వున్నతినీ అంచెలంచెలుగా పెంచుకుంటూ వచ్చింది సావిత్రి. గొప్పింటి నడిసారస్త్రీ అన్న ఎరతో ఆ మనిషి భవిష్యత్తు కోసం అవసరమైన వాడినల్లా ఊరించింది, ఉడికించింది, ఊడిగమూ చేయించుకొంది. పెద్ద పెద్ద అంతస్థుల్లో వున్న మగపురుగుల కామదాహం తీర్చింది. తన అవసరాలూ నెరవేర్చుకొంది. కొల్లలు కొల్లలుగా సంపాదించిన డబ్బునంతా అభాగినుల కోసం, అనాథల కోసం, వారి ఆశ్రయం కోసం ధార పోసింది. ఎందరో అభాగ్యులైన ఆడపిల్లలకు పెద్ద దిక్కై వివాహాలు జరిపించింది. ఎన్నో శరణాలయాలకు ఇబ్బడిముబ్బడిగా దానధర్మాలు చేసింది. ఆ మనిషిని తానాశించిన అందలం ఎక్కించింది. ఆ మనిషి భవిష్యత్తు కోసం తాను కర్పూరంలా కరిగిపోతున్నా, అదే మహద్భాగ్యంగా ఆనందించింది.

000

మళ్లీ గతాన్ని వెనక్కి మళ్లించి, వర్తమానం పై దృష్టిని నిలుపుదాం. ఆ మనిషే ఇప్పటి ప్రొఫెసర్ రంగనాథం. అతని అనురాగాల అర్ధాంగే ఇప్పటి సావిత్రమ్మ. ఇప్పుడా సావిత్రమ్మకు సీరియస్ ఆక్సిడెంట్. ఆమెకు రక్తం కావాలి. మమత, మానవత, త్యాగఉదారతలు, మనుగడ సాగించడానికి సావిత్రమ్మగారు బ్రతికితీరాలి. ఎక్కడ? స్వచ్ఛమైన ఆ మానవరక్తం ఎక్కడహో?

"వాత్సల్యం, దయ, ప్రేమ, మమత నిండిన ఆ గ్రూపు రక్తం ఎక్కడ, ఎక్కడయ్యా?" డాక్టర్ల పరుగులు.

"విజ్ఞత, వివేకం, సంస్కారం, ఉదారత నిండిన ఆ రక్తం ఎక్కడ వుందయ్యా? దయ చేసి చెప్పండి" యూనివర్సిటీల నుండి ప్రొఫెసర్ల ఉరుకులు.

"సమత, మమత, సహృదయత, సహోదరత నిండిన ఆ మానవరక్తం ఎక్కడహో?" సంఘసంస్కర్తల అరుపులు.

"నీతినిజాయితీలు, సేవాత్యాగాలు నిండిన రక్తం ఎక్కడ దొరుకుతుందో ఒక్కరూ చెప్పరేమయ్యా?" నాయకుల గావుకేకలు.

బ్లడ్ నీడెడ్... మంచి కోసం... మానవత కోసం... మానవజాతి అస్తిత్వం కోసం... స్వచ్ఛమైన మానవరక్తం ఎక్కడహో?

■